


# విజయ

కోమలాదేవి

"ఈ పెళ్ళికి మీ రిష్టపడుతున్నారా ?" పెళ్ళికొడుకు విజయను ప్రశ్నించాడు.

ఆమె అతడికేసి వింతగా చూసింది. ఆ ప్రశ్నకు జవాబు ఎంత కష్టమో అతడికి తెలియదా ?

"ఇష్టమే" అని మూడు అక్షరాల్లో అంది.

"ఎందుకు ? నా సంగతి మీకు తెలుసు. బలవంతమేమీలేదు. మనః పూర్వకంగా అంగీకరిస్తున్నారు కదూ?"

ఆమె అతణ్ణి సూటిగా చూచి కళ్ళు వాల్చేసింది.

"మీరు కట్నం ఎందుకు తీసు కోవటంలేదు ? అదే లెండి. కట్నం పేరిట కాకుండా ఏవేవో ఎందుకడగటం లేదు. పెళ్లిచేసి మీ కిష్టమైనవి మీ పిల్లకి మీ రిచ్చుకోండి అనటంలో మీ ఉద్దేశమేమిటి ?"

"నాకున్న లోపం మీకు తెలుసు. అందుకోసం కొన్నింటిలో క్రిందికి దిగ వలసి వచ్చింది."

"అదే. మీరు నార్మల్ అయివుండే నాదాకా రాకపోదురు, ఔనా ?"

"ఔను."

"మీ ప్రశ్నకు జవాబు దొరికే ఉంటుంది."

అతడు తన బెక్కకాలును తడుము కుంటూ సాలోచనగా చూసాడు.

"మాది అతి మామూలు కుటుంబం. అంతా సవ్యంగా ఉన్న వ్యక్తి విలువ ఐదువేలు. మేము అంత ఇచ్చుకోలేము. మరో విషయం మీరు గ్రహించాలి. నాకు తలిదండ్రులు లేరు. అన్నయ్య నన్ను ప్రాణప్రదంగా చూచుకుంటాడు. అతడికి నావల్ల కష్టం కల్గించటం నా కిష్టంలేదు. కనుక మా తాహతులో మీరు కనిపించారు. అందుకని మన స్ఫూర్తిగానే ఒప్పుకుంటున్నాను. పెళ్ళ య్యాక ఏదైనా ప్రమాదంలో కాలుపోయి ఉంటే ఏంచేసేదాన్ని ?"

"మీరు మరొకసారి ఆలోచించు కోండి. ఈ కుంటివాడితో జీవితాంతం గడపాలి. కుంటోడి పెళ్ళాం – అన్న బిరుదును సహించగలరా ? అమ్మా, నాన్నా, మీవాళ్ళు ఈ సంబంధాన్ని యిష్టపడుతున్నారు. కాని మీకు అన్యాయం చేస్తున్నానేమోనని బాధగా ఉంది. తొందరేం లేదు. రేపు సాయంత్రానికి కబురంపించండి", అంటూ లేచాడు. కాని ఆమె అతణ్ణి వెళ్ళనివ్వలేదు.

"రేపటివరకు ఎందుకు ? మీ చేతుల్లో పెడితే నేను సంతోషంగా ఉంటానని అన్నయ్య అభిప్రాయం. నా విషయంలో అన్నయ్య ఎప్పుడూ మంచే చేస్తాడు. అతడి అభిప్రాయానికి నేను విలువ ఇస్తాను. నేను ఒకరి బలవంతం మీద అంగీకరించటంలేదు. నన్ను నమ్మండి."

అతడి ముఖం ప్రశాంతమైంది. చిరు నవ్వుతో ఆమెవైపు చూస్తూండగానే విజయ సిగ్గుతో కళ్ళు వాల్చేసింది. ఒక్క అడుగు ముందుకు వేశాడు. తొట్రుపాటుతో తలెత్తింది. చిరునవ్వు నవ్వి బైటికెళ్ళాడు. కాస్త కుంటిగా నడవటంతప్ప అతడిలో లోపం కొట్టు వచ్చినట్లు కనిపించదు. ఆ "కాలు"కు బాగా అలవాటుపడ్డాడేమో – సునాయా సంగా నడుస్తూ వెళ్ళిపోయాడు.

"విజ్జూ", ఏమన్నాడు ?" ఆత్రంగా అడిగాడు అన్న, కుమార్,

నవ్వింది. "ఏంలేదు. ఆలోచించు కోమంటే - అక్కర్లేదని మా అన్నయ్య మీద భరోసా ఉంచానని చెప్పాను. సంతోషంగా వెళ్ళిపోయారు."

"విజ్జూ, నువ్వు అదృష్టవంతురాలి వమ్మా. ఇంతకన్నా మంచి సంబంధం తేలేకపోయాను. సర్వావయవాలు లక్ష ణంగా ఉన్నా కుళ్ళిపోయే హృదయం గలవాణ్ణి కట్టుకుని సుఖపడే దేముంది. చూస్తున్నావుగా. రక్తమాంసాలతో చేసిన ఆ హృదయం ప్రేమాను రాగాలకు బదులు క్రోధం - పగ - అసూయ - ద్వేషం - అసత్యాలకు నిలయమైతే ఆ వ్యక్తిని జీవితాంతం సహించటం మనకు శక్తికి మించిన పనే అవుతుంది. నాలుగేళ్లుగా అతణ్ణి ఎరుగు దును. నువ్వు సుఖంగా ఉండాలి విజ్జూ. నే కోరేది అదే". అతడి కళ్లు ఆర్ద్రా లయ్యాయి.

వదినను దృష్టిలో పెట్టుకుని మాట్లాడు తున్నాడని గ్రహించింది. ఆమె ఎక్కడ పొంచి ఉండి వింటుందోనని మౌనంగా అన్నయ్య చేతిని అందుకుని ఆప్యా యంగా చెంపలకు రాసుకుంది. ఆ చేతికి తడి తగలగానే ఆందోళనతో ఆమె ముఖాన్ని పైకెత్తి కన్నీరు తుడుస్తూ "నువ్వు నవ్వాలమ్మా" అన్నాడు. విజయ హాయిగా నిష్కల్మషంగా నవ్వింది. అలాంటి నవ్వుచూచి ఎన్ని సంవత్సరాలు అయిపోయాయి !

"ఇక పెళ్ళి పెళ్ళని- పెళ్ళికూతుర్లా ఇప్పట్నుంచే మురిసిపోతే వొంటెవరు చేస్తారు ?" వదిన ఖస్సుమంది.

"ఈ రోజు నువ్వు చెయ్యి." కుమార్ విసుగ్గా అన్నాడు.

"నాకు ఒంట్లో బాగులేదు" అని వెళ్ళి ఆరుబయట అరుగుమీద కూర్చుంది. మూడేళ్ళబాబు ఆకలంటూ తల్లిదగ్గర జేరాడు.

"పో, అత్త నడుగు, పెడ్తుంది" అని తరిమి ఏదో పాత పుస్తకం పట్టు కూర్చుంది.

"ఇంకెన్ని రోజులు ? వారంరోజులు. నాకోసం సహించు విజ్జూ." అన్న వేడి కోలుగా అడిగాడు. విజయ మందహాసం చేసింది.

"నీకోసం ఏదైనా సహిస్తా నన్నయ్యా. నీవు నా పక్షాన ఉండగా ఎవరేమన్నా నాకు భయంలేదు."

అన్నిపనులుచేసి వడ్డించింది. కుమార్, భార్య నోటికి జడిసి ఆమెతో ఎక్కువగా మాట్లాడడు. భార్యను అదుపులో పెట్టటానికి ప్రయత్నిస్తే విజ్జుపై పదంతలు కసి తీర్చుకోటానికి తయారవుతుందన్న సత్యం గ్రహించి మౌనంగానే ఉంటాడు. భోజనం దగ్గర మాత్రం మూడు కంచాలు లేకపోతే లేచి పోయేవాడు. కనీసం అంత చాకిరీ చేసి నందుకు కడుపునిండా తాము తిన్నదే ఆమె తినాలని అతడి అభీష్టం. నయానా భయానా విజయను కూర్చోకుండా

జేయాలని చాల ప్రయత్నించి విఫలు రాలైంది వదిన కమల. మూడు కంచా లలో వడ్డించింది. అన్నను పిలవగానే వదినకూడా వచ్చి కూర్చుంది.

"ఒంట్లో బాగులేదన్నావుగా ?" ఎగ తాళిగా అన్నాడు.

"ఈ ఇంట్లో ఒంట్లో బాగులేని వాళ్ళకి నాన్‌రొట్టె, పాలు, పండ్లు, మందులు దొరుకుతాయా ? ఏదో తిని కళ్ళు మూసుకు పడుకుని ఆరోగ్యం కాపాడుకోవాలి."

"ఫలానా సుస్తీ అని చెప్పకుండా ఏమిటా మాటలు ?" కోపంగానే అన్నాడు.

"నాకేం తెలుసు. పదండి డాక్టర్ దగ్గరికి. పదిరూపాయలు వదుల్తాయి-పాపంకదాని..."

"తల నొప్పా - కడుపు నొప్పా - సోమరితనమా - ఇంటి చాకిరీ అంతా చేసి నడుంనొప్పా లేక అరక్క ఆయాసమా ?"

దిగ్గునలేచిందామె..."అంటే! నన్ను తిననివ్వరా ?"

"అయ్యో, లక్షణంగా తిను..."


"అన్నయ్యా!" ప్రాధేయపడ్తున్నలా అంది. చెల్లి ముఖం చూచాడు. ఆ పూట ఆమె అన్నం తినకుండా లేచిపోతే విజయ పాట్లు చెప్పనలవికాదు. అతడు మౌనం దాల్చాడు.

"తిను వదినా. అలా అన్నం తింటూ మధ్యలో లేచిపోకూడదు."

ఇదే సందు అనుకుని గబగబ తిని వెళ్ళిపోయింది. వంటిల్లు సర్ది గిన్నెలన్నీ కడిగి తలుపు జేరవేసి బాబుకు పాలు త్రాగించి గదిలో కొచ్చేసరికి పదిగంట లైంది. పడుకున్నదే తడవు నిద్ర ముంచుకొచ్చింది.

ఆ యింట్లో ఐదేళ్ళుగా విజయ పని మనిషి — తోటమాలి — ప్యూను — ఆయా — వంటమనిషి- అన్నీను. వది నకు రెండేళ్ళ తరువాత నెలతప్పితే కాలు క్రింద పెట్టకుండా గడుపుకొచ్చింది. అంతేకాదు, సవతి తల్లి పెట్టే బాధల్ని తలదన్నే విధంగా విజయను హింసిం చేది. మాటలతో బాధపెట్టేది. క్రొత్తల్లో కొట్టేదికూడా. అన్నం సరిగా పెట్టేది కాదు. కాని అన్న త్వరలో గ్రహించి ఆమెను హద్దులో ఉంచినా కొన్ని బాధలు విజయకు తప్పలేదు. తొమ్మిదవతరగతి మానేసింది. ఈ మూడేళ్ళుగా ఆ యింట్లో అన్నీ విజయ చూచుకునేది. కమల తినటం, ఏదైనా చదువుకోటం తప్పితే ఒక్కపనీ ముట్టుకునేదికాదు. అంతేకాదు, బాబు బాధ్యతకూడ పూర్తిగా విజయపై బడింది.

పెళ్ళయి వెళ్ళిపోతే ఈ సుఖం ఎక్కడినించి వస్తుంది ? అందుకని విజయ చిన్నపిల్ల — అప్పుడే పెళ్ళేమిటి అంటూ ఉంటుంది. విజయకు పది హే




దేళ్ళు దాటాయి. ఆ గృహంలో ఆమెకు సుఖంలేదు. పెళ్ళివయసు. ఏదో ఒక సంబంధం వెదికి చేయాలి.

భర్తకు అతని చెల్లెలిపై ఉన్న మమత ఆమెకు తెలుసు. అందుకని ముందే జాగ్రత్తపడింది. ఏం దోచిపెడ్తాడోనని అతి మెలకువగా ఉంది. ఆ ఇంట్లో తన పెళ్ళి పనులు తానే చేసుకోవలసివచ్చింది విజయకు. ఏది చేయబోయినా ఆటంకమే. 'ఇంత ఎందుకు - ఇంత ఖర్చు ఎందుకు పెట్టాలి ?' అని రోజూ పోరే. వారుకూడా పెళ్ళికి వచ్చేది పన్నెండు మంది అని చెప్పారు. రిజిస్ట్రారాఫీసులో పెళ్ళి జరిపించి ఇంటిలో నిరాడంబరముగా ముచ్చట్లు జరిపించి భోజనాలు అయిపోయాక వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నారు. ఆ మాత్రానికే కమల ఇల్లు గుల్లయిపోతున్నట్లు సూటి పోటిమాటలనటం ప్రారంభించింది.

విజయ రోజులు లెక్కపెట్టుకుంటుంది. భర్త బి. ఎ. చదివాడు. మెట్రిక్ పాసయి ఏదో చెయ్యాలి. తను కూడా సంపాదించాలి. విజయ ఏమేమో ఆలోచించుకునేది. ఇక రెండురోజుల్లో పెళ్ళయి వెళ్ళిపోతుంది. అన్నను వదిలి వెళ్ళిపోతున్నానని బాధపడ్తున్నాదో — వదిన బారినించి తప్పించుకుంటున్నానని ఆనందంగానూ ఉన్నది. నరకాన్ని అనుభవింపచేసిన వదినను విడిచి ఎప్పుడెప్పుడు వెళ్ళిపోతానా అన్న ఆతృత అధికమౌతుంటే తనలో తాను నవ్వుకునేది.

ఆ రోజు వచ్చింది. పెళ్ళి రిజిష్టర్ అయింది. ఇంటికొచ్చి మంగళసూత్ర

ధారణ జరిపించారు. భోజనాలయి పోయినై. ఆ రోజుకూడా కమల పెద్దగా పెత్తనం తీసుకోలేచు. ఇంకో రెండేళ్ళు ఆగకుండా పెళ్ళిచేసి పంపిస్తున్న భర్తమీద కోపం పీకదాకా ఉంది. వెళ్ళిపోతున్న విజయమీద కోపం చెప్పనలవికాదు.

విజయ పెదతల్లి, పెదతండ్రి పూనుకుని వంటా అదీ చూచి అయిందనిపించారు.

విజయ భర్తతో కలిసి ఆ సాయంత్రమే వెళ్ళిపోతోంది. చెల్లెలి చేతిలో ఐదువందలుంచాడు ఆమె అన్న.

దాన్ని చూచి కమల కళ్ళలోంచి నిప్పులే కురిశాయి.

"ఇన్నేళ్ళుతిని గుల్లచేశావు. ఇప్పుడూ గుల్లచేసేసి వెళ్తున్నావు. సారె సారెకు అన్నా అంటూ వచ్చి దోచుకుపోతావేమో జాగ్రత్త. అంతగా మీ అన్నను చూడాలంటే, రాయి. నేను పంపిస్తాను. నువ్వు, నీ మొగుడు రానక్కర్లేదు. ఆ కుంటాడితో ఏం సుఖపడ్తావులే. కొంప ముని గి పో యి న ట్లు పెళ్ళిజేసుకుని వెళ్తున్నావు."

మంచిమాటలు చెప్పటానికి ప్రక్కకు తీసు కెళ్ళిందనుకున్నారంతా. దుఃఖంతో కళ్ళు ఒత్తుకుంటూ వచ్చిన చెల్లెలిని చూచి కుమార్ హృదయం ద్రవించిపోయింది. ఆప్యాయంగా కన్నీరు తుడిచి ఆమె భర్తకు అప్పగించాడు.

బండి కనుమరుగయ్యేవరకు చూచి కన్నీరు తుడుచుకుని ఇంటికొచ్చాడు.

ఇక ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంటుంది. విజయ లేదు. కమల మామూలుగా ఉంటుంది. తిట్టి, ఆడిపోసుకోటానికి చెల్లెలు ఉండదు. ప్రశాంతంగా ఉంటుందనుకున్నాడు. గాని,

పెళ్ళి ఖర్చు వెయ్యిరూపాయలు అయిందని తెలిసి మండిపోయింది. అంతేకాదు, అత్తగారి నాల్గుతులాల గొలుసు విడిపించి చెల్లెలికి ఇచ్చినందుకు ఆమె నాలుక ఎంత పదునైనదో నిరూపించుకుంది. ఏనాటి కానాడు శాంతిస్తుందనుకుంటూనే సంవత్సరం గడిపేశాడు.

విజయ సంసారం మూడు పువ్వులారుకాయలుగా వర్ధిల్లుతోంది. అన్న రమ్మని రాసినా ఏదో సాకుతో రాకుండా అన్ననే పిలిపించుకు చూచి తృప్తిపడేది. విజయ సమస్యను గ్రహించిన భర్త ఆమెను ఏ విషయంలోనూ ఆటంక పెట్టేవాడుకాదు.

సంవత్సరాలు దొర్లిపోతున్నాయి.

విజయకు ఆడపిల్ల - మొగపిల్లవాడు కలిగారు.

కుమార్‌కు ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు.

విజయ భర్తకు కాకినాడ ట్రాన్స్‌ఫర్ అవగానే రాకపోకలు బాగా తగ్గిపోయాయి. సంవత్సరాని కొకమారు వెళ్ళి చూచి వచ్చేవాడు కుమార్.

ఏ కాస్తంత ప్రేమ కనపరిచినా పుట్టిల్లంటూ వచ్చేస్తుందేమోనని కమల పైపైకి కూడా ప్రేమ కనపర్చలేదు. విజయ మెట్రిక్ పాసయి ఉషా వాళ్ళు నడిపే కుట్టు స్కూల్లో జేరి కుట్లు, కత్తిరింపులు నేర్చుకుని ఇంట్లో గుడ్డలు కుట్టటం హాబీగా పెట్టుకుంది. వచ్చే డబ్బు చిల్లర ఖర్చులకి సరిపోతుంది.

విజయ భర్త ఆనంద్‌సాగర్ చెక్కకాలు తీయించేసి మెకానికల్ కాలు పెట్టించుకోవటంతో అతడి పని సుఖమైంది. బాంక్‌లో క్యాషియర్‌గా అతడు స్థిరపడిపోయినప్పుడు కుమార్ అమితంగా ఆనందించాడు.

ఆ మాట విన్న కమల హృదయం ద్వేషంతో, అసూయతో నిండిపోయింది. అతడు క్యాషియర్ అవటమేమిటి? తన భర్త లింగు లింగుమంటూ యు.డి.సి.గా మారటమే గొప్ప! ఏమీ లేని వారు ఒక్కో మెట్టు తమంతట తాము ఎక్కుతుంటే ఎన్నేళ్ళైనా పట్టవచ్చు.

దాంతో కమల సతాయింపు అధికమైంది.

భర్తను తూలనాడటం ప్రారంభించింది.

ముగ్గురు పిల్లలుకూడా తల్లిలాగానే అసంతృప్తితో తిట్టుకుంటూ కాలం గడుపుతున్నారు.

సినిమాల్లేవు—షికార్లులేవు — చక్కటి క్రొత్తరకం ఫాషన్ గుడ్డల్లేవు — పిక్నిక్‌లు లేవు. చుట్టాలింటికి వెళ్ళటం అసలే లేదు! ఇల్లు — స్కూలు — ఇంటిపనులు— బడిపనులు. జీవితం ఈ పరిధిలో తిరుగుతోంది !

చికాకుపడిపోతూ — తిట్టుకుంటూ — విసుక్కుంటూ - అరుచుకుంటూ - తల్లిని ఎదిరిస్తూ - మసలటం వారి కలవాటయిపోయింది.

కుమార్ వారికి బుద్ధిమాటలు చెప్పేవాడు - పంతంగా భర్త చేతకానివాడని పిల్లలకు ఎత్తిచూపి తండ్రిమీద గౌరవం లేకుండా చేసింది కమల.

ఆ కుంటాడు క్యాషియర్! ఈ పనికిరానివాడేమో ఇంకా యు. డి. సి. నే! ఆమె ఆలోచనలు పైకి అనేసేది. కుమార్ నొచ్చుకున్నా మాట్లాడేవాడుకాడు.

అక్కడ - అత్తగారింట్లో విజయ నరకం చూస్తోందని వింటే ఆమె ఎక్కువగా ఆనందించేది. విజయ సుఖపడిపోతుందని ఆమె పడేబాధ చెప్పనలవి కాదు. సంవత్సరాలు గడుస్తున్నాయి. పిల్లలు హైస్కూలు చదువులు చదువుతున్నారు. కుమార్ గుట్టుగా సంసారాన్ని లాక్కువస్తున్నాడు

ఆడపిల్లలకి సుమారైన చదువు చెప్పించి ఏదైనా సర్టిఫికెట్ చేతిలో పెట్టి పంపాలి. అదే అతడి ఆశయం. పెద్ద కొడుకు వారిద్దర్నీ ప్రేమగా చూచు

క్రోడని అతడికి తెలుసు. తల్లిలాగానే వారికి ప్రేమ అంటే ఏమిటో తెలియదు.

రెండు సంవత్సరాలు దాటినా అన్న రాకపోయేసరికి విజయ అన్నకు వంద రూపాయలు పంపి వెంటనే రమ్మని రాసింది.

"నేను కాకినాడ వెళ్తున్నాను." ఆ రాత్రి భోజనాల దగ్గర తాపీగా అన్నాడు.

"బోలెడు డబ్బు ఖర్చు. వెళ్ళి ఏం చూస్తారు ? మీ చెల్లి ఆడంబరం - వైభోగమూనా ? చూడు నాకెంత ఉందో అని చూపెట్టుకోటానికి మిమ్మల్ని రమ్మనటం బావుంది. మీరు వెళ్ళటం అంతకంటే బావుంది. సిగ్గు లేకపోతే సరి."

"సిగ్గెందుకు. వారిద్దరూ శ్రమపడి చదువుకున్నారు. తెలివితో సంసారాన్ని దిద్దుకుంటున్నారు. అతడి అదృష్టం ! ప్రమోషన్ వచ్చింది. చూచి వస్తాను. ఈ జీవితంలో నా కెక్కడైనా శాంతి సౌఖ్యం లభిస్తుందా అంటే అది విజయ దగ్గరే."

"అవ్వ... చూచారే - ఎంత మాట న్నారో... అప్పటికి నేను ఏమీ చేతకాని దాన్ననేకదూ..."

ఆమె మాటలకు అడ్డు తగిలాడు. "లేదు. నేను చేతకానివాడిననే ఎత్తి చూపుతున్నాను" అని లేచి వెళ్ళి పోయాడు.

అతడి మాటల్లోని అంతరార్థం అంద రికీ బోధపడింది. కమల తిట్టుకుంటూనే ఉంది.

చిన్న సంచీ తీసుకుని పదిగంటల రైలుకు వెళ్ళిపోయాడు.

అన్నయ్యను చూడగానే విజయ కడుపు నిండిపోయింది. పిల్లలిద్దరు మామయ్య అంటూ ఆప్యాయంగా చుట్టు చుట్టు తిరిగారు.

"అన్నయ్యా-పిల్లల్ని కూడా చూడ లేదు. ఎలా ఉన్నారు? ఒకమారు తీసుకు రాకూడదా ? చూడాలని ఉంది. చక్కటి వయసు ఇది."

కుమార్ పేలవంగా నవ్వాడు. "ఔనమ్మా. వయసు చక్కనిదే కాని వాళ్ళు మీ వదిన ట్రైనింగ్‌లో పెరిగారు కదా ? నువ్వు చూచి ఆనందించలేవు. అందుకే చూడకుండా ఉంటేనే మంచిది."

విజయ అర్థంచేసుకుంది. ఆమె హృదయంలో ఒక్కసారిగా ఐదు సంవ త్సరాలు వదిన హయాంలో పడ్డబాధలు పురి విప్పుకున్నాయి. బాధతో బరు వెక్కిన హృదయాన్ని అతిప్రయాసతో సముదాయించుకుంది. ఉన్న మూడు రోజులు అన్నకు ఇష్టమైన వంటకాలు చేసి వడ్డించింది. ఓ పూట సినిమా కెళ్ళారు. మూడు జతల గుడ్డలు కొన్నది. వదినకు పిల్లలకు అంటూ అవీ ఇవీ కొన బోయింది. "వద్దు విజ్జూ, ఇలా నేను



తీసుకువెళ్తే దానికి పెడర్థాలు తీస్తుంది. నీవు ఏదో ఉద్దేశాన్ని పెట్టుకుని తనను కించపర్చటానికి - నీ హోదా చూపుకోటానికి పంపావనుకుంటుంది." అన్న ఆటంకపరుస్తుంటే ఖిన్నురాలై చూచింది.

"నీవు ఇస్తే సంతోషంగా తీసుకెళ్ళగలను కాని ఆ తరువాత నా సంతోషమంతా క్షణికమే అవుతుంది. నా కిచ్చావు, అంతే చాలు."

ఆనంద్‌సాగర్, కుమార్ ఎన్నో విషయాలు ముచ్చటించుకున్నారు. కుమార్ వెళ్ళిపోయేరోజు వచ్చేసింది బుట్టనిండా పిండివంటలు పెట్టింది. కన్నీటితో సాగనంపింది

రైలెక్కి తృప్తిగా కళ్ళుమూసుకున్నాడు కుమార్.

ఆరుమాసాలు కాలగతిలో లీనమయ్యాయి. ఒకనాడు-అన్న రాసిన ఉత్తరాన్ని చూచి గాభరాపడిపోయింది విజయ.

"... మీ వదిన శరీరంనిండా కుళ్ళే కదా ? ఒకరికున్నదని తనకు లేదని కుళ్లి కృశించిపోయింది. కడుపులో అల్సర్, కిడ్నీలో స్టోన్, బ్లడ్ ప్రెజర్ చాల తక్కువ ఈ పరిస్థితుల్లో ఆమెను హాస్పిటల్‌లో వేశాను. అంతా ఆ భగవంతుడిపై భారం వేశాను."

ఉత్తరం పోస్ట్‌చేసిన మూడవరోజు సాయంత్రం ఇంటికి రాగానే విజయ ఎదురొచ్చింది.

"విజ్జూ, వచ్చావా ?" అంటూ ఆమె తలను రెండు చేతుల్లోకి తీసుకుని ఆమె శిరస్సుపై తన నుదురు ఆనించాడు.

"వదినకు బాగయ్యేవరకు ఉండి వెళ్తా నన్నయ్యా. నువ్వేం దిగులు పెట్టుకోకు. కావలసిన మందులు అవీ వాడి వీలైన వెంటనే ఆపరేషన్ చేయిద్దాం. నువ్వు అధైర్యపడొద్దు."

"నువ్వు వచ్చావు, నా కింక బెంగ లేదమ్మా."

తండ్రిని - అత్తను మార్చి మార్చి చూచిన ఆ ముగ్గురు పిల్లలు ఎంతో ఆశ్చర్యపోయారు. ఇటువంటి అత్తను గూర్చేనా తల్లి ఏమేమో చెప్పింది!

ఐదుగురూ కాఫీలు త్రాగారు.

నేను ఇక్కడ ఉన్నట్లు మీ అమ్మకు చెప్పకండి. కోపంతో ఆమె స్థితి దిగజారి పోగలదు. జాగ్రత్తగా ఉండండి" అని చెప్పింది విజయ.

పాలుకాసి ఫ్లాస్కులో పోసింది విజయ. పాల ఫ్లాస్క్ తీసుకుని పెద్దకొడుకు వెళ్లిపోయాడు. అతడికి అంతా అయోమయంగా ఉంది.

ఇంట్లో పనులు ఠంచనుగా అవుతున్నాయి. బడులకు వెళ్లేవరకు ఎవరో ఒకరు తల్లి దగ్గర ఉంటున్నారు. రాత్రుళ్ళు చాలసేపు కుమార్ ఉండి వస్తాడు. పెద్దపిల్ల అక్కడే పడుకుంటుంది.

కుమార్ చేతిలో డబ్బు చూచి డాక్టర్లు శ్రద్ధజూపజొచ్చారు. పక్షం రోజులకు ఆమెకు కిడ్నీ స్టోన్స్ తీసి వేశారు. ఆ రెండురోజులు అపస్మారక స్థితిలో చావు బ్రతుకులమధ్య ఊగిసలాడింది. ఆ రెండురోజులు వదిన మంచం దగ్గరే ఉండిపోయింది విజయ. మూడవరోజు కళ్ళుతెరిచే వేళకు మెల్లగా తప్పుకుంది.

గండం గడిచిందని డాక్టర్లు చెప్పగా విని సంతోషంతో ఇంటి కెళ్ళింది.

ఆ రోజు విజయ హాయిగా నిదర బోయింది. అన్నయ్యను భగవంతుడు రక్షించాడు. లేకపోతే అన్నయ్య దుఃఖాన్ని తను చూడగల్గేదా ?

టిఫిన్ సర్దిపెట్టింది. పాలు ఫ్లాస్క్‌లో పోసింది.

మేనకోడలు ఆమెను తదేకంగా చూచి "అత్తా – అమ్మకు నీ మీద కోపమెందుకు ?" అని అడిగింది

విజయ నవ్వింది. ఆ పిల్లను అక్కున జేర్చుకుంది.

"మీ అమ్మకు కోపం ఎక్కువ. కానా ?"

"ఊఁ."

"అంతే. కారణం ఇది అంటూ లేదు. నన్ను చూడగానే ఆమెకు కోపం. కొందర్ని చూస్తే అప్యాయంగా పలుకరించాలని, వారిదగ్గర కొన్ని క్షణాలు గడపాలని ఉంటుంది. కొందర్ని చూస్తే వారికి దూరంగా ఉండాలనిపిస్తుంది. ప్రథమంలోనే ఈ అభిప్రాయం కల్గటానికి కారణాలుండవు. తల్లి తండ్రి లేని నన్ను అన్నయ్య అపురూపంగా చూచుకునే వాడు. బహుశః అది సహించలేకపోయిందేమో వదిన. అంతే."

"ఉహూ. నువ్వు ఏదో దాస్తున్నావు" అంది గోముగా.

"లేదు. నేనేమీ దాయటంలేదు."

"కానీ అంతా చెప్పలేదు."

"ఔను. చెప్పలేదు. చెప్పితే లాభం కనబడదు. అందుకని వూరకుండటం శ్రేయస్కరం."

పిల్లల్లో మార్పు గమనించి కుమార్ అధికంగా సంతోషించాడు. వాళ్ళు విసుక్కోవటంలేదు. అత్త చెప్పినమాట బుద్ధిగా వింటున్నారు. రాత్రిళ్ళు వాళ్ళకు చదువుకూడా చెప్పేది విజయ. ప్రేమకు, ఆప్యాయతకు లొంగని పసిహృదయాలుంటాయా ?

అక్కడ విజయ అతిసాధారణ దుస్తుల్లో ఉండేది. మెడలో ఒక్క గొలుసు, దిద్దులు తప్ప మరే ఆభరణాలు ధరించేదికాదు.

వాళ్ళతో కలిసిపోయి వారితో సమానంగా ఉండాలని అన్నీ వదిలి మామూలు చీరలు నాల్గు తెచ్చుకుంది. తనను చూచి పిల్లలు అసూయపడకూడదు.

"విజ్జూ, నెలరోజులు అయిపోయాయి. పిల్లల్ని వదిలి వచ్చావు ఇంకా పక్షం రోజులు పట్టేలా ఉంది.

"ఫరవాలేదన్నయ్యా. అర్థాంతరంగా ఒదిలి వెళ్తే నాకు తృప్తిలేదు. పిల్లలు కూడా రాశారు, అత్తకు బాగయిన వెంటనే రమ్మని వాళ్ళు ఇల్లు దిద్దుకోగలరు. మీ బావకు బాగా వంట చేతనవును. నువ్వేం దిగులుపడకన్నయ్యా. అవసరానికి – ఆపదల్లోకాక మరెందుకు తోబుట్టువులు. నాకుమాత్రం ఎవరున్నారు" అంది. అమె కళ్ళలోని తడి ముగ్గురు పిల్లలు చూచారు.

"నాకోసం ఎంత అవస్థపడ్తున్నారు. ఇల్లు దిద్దుకుని పనిలోకి వెళ్ళి ఎంత సతమతమౌతున్నారో అని ఈవాళ కన్నీళ్లు పెట్టుకుంది మీ వదిన. నాలిక దాకా వచ్చింది. ఇంట్లో దేవత వెలిసిందని చెబుదామనుకుని మళ్ళీ మౌనం దాల్చాను."

ఎన్. జి. ఓ. క్రింద ఎన్ని ఫ్రీగా వచ్చినా మిగతావాటికి ఎంతో ఖర్చు పెడ్తోంది విజయ.

ఆవేళ మూడొందలు మనియార్డర్ అందుకుంది. ఇంటికి కావలసిన సరకు తెచ్చుకుంది. వదినకు కావలసిన హార్లిక్స్–టానిక్స్ అన్నీ తెచ్చింది.

"ఎంత ఖర్చుపెడుతున్నావు విజ్జూ" అంటే ఆమె సహించలేకపోయేది.

పిల్లల పరీక్షల వేళకు కమల ఇంకా హాస్పిటల్‌లోనే ఉంది. పిల్లలు ముగ్గురు ప్రతి ఏడాదికన్నా ఈసారి పరీక్షలు చక్కగా రాశారు.

మౌనంగా అన్నిపనులూ చేసుకుని– పిల్లలతో కొంతసేపు సరదాగా గడిపి భోజనానంతరం చదువులో సాయంచేసి– అటు వదినకు హాస్పిటల్‌కు పంపవల సినదంతా పంపుతూ ఇల్లు దిద్దు కుంటున్న అత్తపై ప్రేమానురాగాలు పెంచుకున్నారు ముగ్గురు పిల్లలు.

"ఒరేయ్, నిన్ను నేనే సాకాను. నన్ను మర్చిపోలేదు" అని మురిసి పోయేది విజయ మేనల్లుడిని చూచి.

"ఈసారి మీ ప్రసాదును – నళినిని తీసుకురా అత్తా" అన్నారు ఆడపిల్లలు.

"దూరం తల్లీ. రైలుకు బోలెడంత అవుతుంది. చూద్దాంలే. ఎప్పుడైనా మీరే రండి."

ఆవేళ సాయంత్రం – అంటే ఏడు వారాల తరువాత కమలను ఇంటికి తీసుకువస్తున్నారు.

ఇల్లంతా నీటుగా సర్దింది విజయ. పిల్లలు తయారై హాస్పిటల్‌కు వెళ్ళారు. వారికిఎంతో సంతోషంగా ఉంది కుమార్ మాత్రం భారభరిత హృదయంతో గుమ్మం దాటాడు.

విజయ గబగబ వంట చేసింది. వదినకోసం పడక సిద్ధంచేసింది.

టిఫిన్‌లో నాల్గు చపాతీలు, కూర సర్దుకుంది. సామాను సర్దుకుని రెడీగా ఉంది. నాలుగ్గంటలకు తనకు రైలుంది.

రిక్షాలోంచి దిగుతున్న పిల్లలకు తలుపుకు వేసిన తాళంకప్ప అత్యం తాశ్చర్యాన్ని గొల్పింది.

తండ్రివైపు గాభరాగా చూసారు.

కమలను ఇంకా రిక్షానుంచి దింప లేదు.

అతడు సైగజేశాడు. జేబులోంచి తాళంతీసి తలుపు తీస్తుంటే ఆడపిల్లలకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ఔను, అత్తయ్య వెళ్ళిపోయింది మనకు చెప్పలేదు" ఉదాసీనంగా తల్లిని దింపి లోపలికి తీసుకెళ్ళారు.

కమల మంచంమీద పడుకుంది.

కుమార్ పాలు తెచ్చాడు.

పాలు అందుకుని "విజయ ఏదీ, కనబడదేం ?" కుమార్ ఆశ్చర్యంతో చూసాడు.

"నాకు తెలుసు. నర్సులు – నా ప్రక్క బెడ్‌వాళ్ళు చెప్పారు విజయ రెండురోజులు నా బెడ్‌దగ్గరే ఉందని. ఏదీ?"

కుమార్ ముఖం ఆనందంతో విప్పా రింది "రైలు వచ్చే వేళ, లేటయితే విజయ స్టేషన్‌లోనే ఉంటుంది. పిల్చు కొస్తాను" అంటూ సంబరంతో పరుగు దీశాడు.

---